స్కెచ్

# నేనెవర్ని?

"వెంచాశా"

ప్రపంచంమీద కోపం, అసహ్యం, ఈర్ష్య, జుగుప్స, మొదలైనవి కలిగినయి నిశ్చలరావుకు. దానికి కారణం తనకే తెలియడంలేదు. ఇన్నాళ్ళూ బాగానే ఉన్నానే...ఇప్పుడేం వచ్చిందీ అనుకున్నాడు.

నిశ్చలరావు పని చేస్తున్న ఆఫీసులో తన యజమాని ఒకరోజున తనను అనవసరంగా అవమానపరచాడు. తనను అకారణంగా దూషించి అవమానపరచాడు. ఎవరూ చూడకుండా కంట తడిపెట్టుకుని చిన్నబుచ్చుకున్నాడు నిశ్చలరావు. ఆరోజు ఎవ్వరితోనూ ఏమీ మాట్లాడలేదు. ఏం!...మనిషిమీద మనిషికి ఏం అధికారం ఉంది. అలా దూషించడానికి నే నాయన కడుపున పుట్టలేదే అనుకున్నాడు.

నిశ్చలరావు మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. ఆస్థిలేదు వందరూపాయలు తెచ్చుకుంటున్నాడు. నిశ్చల భార్య చాలా అందమైనది. నిశ్చలరావు కథకుడు, కవి, రచయిత, మనస్తత్వవేత్త, సున్నితమైనవాడు. తమలో సరుకు లేకుండా ఉన్నట్టు నటించి గర్వపడేవాళ్ళను, ఇతరులను అన్యాయంచేసి, డబ్బు సంపాయించి, కూడబెట్టి—అది మూలుగుతున్నదో లేదో అని చూసేవాళ్ళంటే అతనికి కడుపుమంట. భూమ్మీద జన్మించిన ప్రతివాడూ సమానమేనని అభిప్రాయం. అలాంటప్పుడు ఒకరిపై ఒకరికి ద్వేషాలెందుకు? ఈర్ష్యలెందుకు? ఉన్నవాడు లేనివాడిని పీక్కుతినడం లేనివాడు లేదని ఏడవడం. ఉన్నవాడు ఇంకా ఉండాలని ఉబలాటపడడం ఎందుకంటాడు నిశ్చలరావు. నిశ్చలరావు మాటలు ఎవరికి లెక్క??

నిశ్చలరావుకు తను సంపాయిస్తున్న డబ్బు సరిపోవడంలేదు. డబ్బుకు ఇబ్బంది పడ్డప్పుడల్లా భార్య ఒంటిమీదఉన్న సొమ్ము ఒక్కొక్కటి అమ్ముతూ రోజులు గడుపుతున్నాడు. అతని కొకసారి జబ్బు చేసినపుడు గొలుసు అమ్మి నయం చేసుకున్నాడు. చేతిగాజులు అమ్మబోతుంటే భార్య తనను ఎదుర్కొన్నది. నిశ్చలరావుకు కోపంవచ్చి పుట్టినపుడు ఈ బంగారం అంతా దిగేసుకుని పుట్టావా అని గదమాయించాడు. తన భార్య వంటిమీద ఉన్న బంగారం, డబ్బుగా మారినప్పుడు, అది డాక్టరు దగ్గరకు వెళ్ళి తన జబ్బు నయం చేసింది. డాక్టరు డబ్బు పుచ్చుకోకుండా మందు ఇస్తే, ఆమె వంటిమీద బంగారం అలాగే ఉండిపోయేది. మనదేశం బీద దేశం, జబ్బుల దేశం, దరిద్రదేశం అని విసుక్కున్నాడు నిశ్చలరావు. జుట్టు పీక్కున్నాడు. మనశ్శాంతి లభించలేదు. తన తలను గోడకు గుద్దుకున్నాడు. ధ్వని వచ్చింది. బొప్పికట్టింది. భార్య వచ్చి కౌగలించుకుంది. నేను ఆత్మహత్య చేసుకోనులే, భయపడకు అన్నాడు నిశ్చలరావు.

నిశ్చలరావు భార్యకు ఒకరోజున తీవ్రంగా జ్వరం వచ్చింది. ఒకరోజు శలవు పెట్టాడు ఆఫీసుకు. ఆమెకు వారం రోజులవరకు తగ్గలేదు. తను తప్ప ఇంట్లో ఆమెకు సాయం చేసేందుకు ఎవరూ లేరు. తను ఇంట్లోంచి కదిలితే ఆమె కేకలు పెడుతుంది. ఎలాగో దగ్గరున్న మందుల కంపెనీకి వెళ్ళి మందులు తీసుకుని, అక్కడనుండే టెలిఫోన్‌లో తన ఆఫీసు మేనేజరుతో ఉన్న విషయం అంతా చెప్పి వారంరోజులు శలవ కావాలి అని అడిగాడు. టెలిఫోనులో కూడా మేనేజరు తనను కోప్పడ్డాడు. ఒక రోజయిన తరువాత తనకు ఓ కాగితం వచ్చింది. ఆఫీసునుండి "నీవు చీటికీ మాటికీ శలవులు పెట్టున్నావు. నీ వ్యవహారం ఏమీ బాగాలేదు. ఇది ఆఖరు వార్నింగ్‌గా గమనించి ఇకముందు శలవ పెట్టితే చర్య తీసుకోబడును" అని ఉన్నది దాంట్లో.

నిశ్చలరావుకు విపరీతమైన కోపం వచ్చింది. నీమీదనే నేను చర్యతీసుకుంటాను అని అన

తున్నాడు. పళ్ళు కొరికాడు. ఉద్యోగానికి రాజీనామా పెట్టాడు... భార్య- జబ్బులో ఉండి కూడా తొందర పడవద్దని గట్టిగా చెప్పింది. నోర్ముయ్... అన్నాడు నిశ్చలరావు. నిశ్చలరావు దగ్గర డబ్బు అయిపోయింది. బజారుకు వెళ్లి తను అన్నంతినే వెండికంచం అమ్మి డబ్బు తీసుకుని వచ్చాడు. కొద్ది రోజుల్లో, ఇంట్లోని వస్తువులన్నీ మాయమైనవి. భార్య మంగళసూత్రంలోని రెండు బంగారు రేకులు మిగిలినవి. అవి తీయబోతుంటే భార్య నివారించింది. ఇద్దరికీ మాటలలో ఘర్షణ జరిగింది. నిశ్చలరావు కోపం ఆపుకోలేక పోయినాడు. భార్య ముక్కు మీద పిడికిలితో బలమైన దెబ్బ కొట్టాడు. భార్య ఒళ్ళు తెలీకుండా పడిపోయింది. తరువాత కొద్ది నిమిషాలకు ఆమె చచ్చిపోయింది. నిశ్చలరావు చలించలేదు. నీవెవరవు? అని అతన్ని ఎవరో దబాయించారు, పెద్దగా. వెనక్కు తిరిగి చూశాడు. అక్కడ ఎవరూ లేరు. 'నేను ఎవరిని?' అని అనుకున్నాడు.

మూడు నెలలయింది. నిశ్చలరావు చిక్కి శల్యమయినాడు. ఊరిబయట పడిపోయిన గుడి ఆవరణలో కూర్చున్నాడు. అతనికిపుడు దమ్మిడీ లేదు... చినిగిపోయిన తన గుడ్డలు తప్ప. భార్య లేదు. ఉద్యోగం లేదు. అది కావాలి ఇది కావాలి అని లేదు. అతనికన్నీ కావాలి. అన్నీ అక్కర్లేదు. అతనిలో తేజస్సు ఉన్నది. అది చూసేవాళ్ళకు కనిపిస్తుంది. నేనెవరిని? ... నేనెవరిని...? అని అనుకుంటాడు. ఈ చెయ్యి నాది, ఈ ముక్కు నాది, ఈ కళ్ళు నావి, ఈ కాళ్ళు నావి, ఈనోరు నాది. ఈ దేహమంతా నాదే ... ఈ చొక్కా. ధోవతి రెండు కూడా నావే. అయితే 'నేను' అన్నది ఎవరు. నాలో ఉత్సాహం లేదు. నాకు ఆకలి అవుతున్నది. అంటే 'నేను' ఎవర్ని. నేను నేనే... అని అనుకున్నాడు. నీవే అంటే ఎవరు నీవు అని అడిగినయి పడిపోయిన గోడలు.

''అంటే నేనే. అంటూ తన శరీరాన్ని తడుముకున్నాడు. ఈ శరీరంలోని అన్ని భాగాలు నీవే, నేనే ఈ శరీరం" అన్నాడు.

"ఇది నా ముక్కు, ఇది నా కన్ను ఇది నా చెయ్యి అంటావా కాని అవి నీవు కావుగా. కన్నువు, ముక్కువు, చెయ్యివి నీవు కావు. అవి నీవి. అంటే నీకు చెందినవి అని అంటున్నావు. 'నీవు' అంటే నీవెవరవు? ఇదిగో నేను అని చూపించు'' అని సవాలు చేసినయి గోడలు.

నిశ్చల రావు తికమక పడ్తున్నాడు. అవును నిజమే. నే నెవరిని; ఈ శరీరంలోని భాగాలు నావి. ఒక్కొక్కటి నావి అంటే 'నా' అనే పదంలో 'నేను' ఎవరిని? నేను ఎవరిని? నేను ఎవరిని! నేను ఎవరిని అని గట్టిగా అరిచాడు నిశ్చలరావు. గోడలు ప్రతిధ్వనించినయి. నిశ్చలరావుకు కాళ్లు నిలవలేదు. పరుగెత్త నారంభించాడు. నే నెవరిని? అనుకుంటూ. అదే తెలుసుకోమని గోడలు అతన్ని తరుముకుంటూ వెళ్ళినయి.

## "కవితంటే ఏమిటిరా?"

'విం జమూరి'

కవితా వనితా చంచల
దృగ్జ్యోత్స్నా లహరిలోన
కమ్మని కల లెన్నెన్నో
కనుచు కరిగిపోవు కవీ!...
కవితకు సార్థక మేదోయ్?
కలలకు అర్థమ్మేదోయ్?

ముద్దరాలి ముద్దుమోము
నిద్దపు తళతళలా?...
సఖియ మధురమధురాధర
గళదమృత ఝరులా?...
కవితకు సార్థక మేదోయ్?
కలలకు అర్థమ్మేదోయ్?

నిర్భాగ్యపు గర్భగుడిని
నిద్రించే శిలా ప్రతిమయా?...
మత దురహంకారమత్త
మాలిన్యపు సంఘమూర్తియా?...
కవితకు సార్థక మేదోయ్?
కలలకు అర్థమ్మేదోయ్!

కండలు కరుగగ ఎండల
కష్టించే శ్రమజీవుల
ఘర్మాంబు సముద్భూతపు
కరుణారస చరితమ్మా?...
కవితకు సార్థక మేదోయ్!
కలలకు అర్థమ్మేదోయ్!